
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 14 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.33,190
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,190 పలికాయి.



టమాట కిలో రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 33.1°/22.5°
జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తుంపర్లు పడ్డాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అమరనాథ్‌రెడ్డిపై కేసుల పరంపర

- వీరచిన్నయ్యగారిపల్లిలో నకరికల్లు పోలీసుల విచారణ



అమరనాథ్‌రెడ్డి ఇంట్లో విచారణ చేస్తున్న పోలీసులు

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ వీరచిన్నయ్యగారిపల్లి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డిపై కేసుల పరంపర కొనసాగుతోంది. 'తల్లికి వందనం' పథకం అమలు చేయకుండా రూ.99కే క్వార్టర్ మద్యాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఉటంకిస్తూ 'విద్య వద్దు.. మద్యం ముద్దు' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై పల్నాడు జిల్లా నకరికల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం వీరచిన్నయ్యగారిపల్లికి వచ్చారు. అయితే అమరనాథరెడ్డి అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులను కలిసి విచారించారు. ఈ కేసుతో కలిపి అమరనాథరెడ్డిపై మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ పాలనపై భావ ప్రకటనను సామాజిక మాధ్యమం ద్వారా పంచుకుంటే ఇలా కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టడం ఏంటని పలువురు గ్రామస్తులు చర్చించుకోవడం కనిపించింది. పాలనలో లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు పోవాలి గానీ ప్రశ్నించడమే మహాపరాధం అంటే ఎలా అని ప్రభుత్వ తీరును తప్పు పట్టారు.

12 మండలాల్లో వర్షం

- వరి, కంది పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన



వడ్ల రాశులను కప్పి ఉంచిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 12 మండలాల్లో వర్షం కురిసింది. తలుపుల మండలంలో 27.4 మి.మీ., గాండ్లపెంట 22.6, నల్లచెరువు 16.8, ఎన్పీ కుంట 15.2, ఓడీ చెరువు 10.2, కదిరి 9.2, గోరంట్ల 6.2, తనకల్లు 5.8, అమడగూరు 5.6, నల్లమాడ 2.6, ముదిగుబ్బ 2.2, పుట్టపర్తిలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి మడులు పడిపోగా.. వాటిలో తేమ ఆరిన తర్వాత కోతలు కోస్తున్నారు. ఇప్పుడిప్పుడే వడ్లు కల్లాలకు చేరుతున్నాయి. ఈ సమయంలో వర్షం కురిస్తే వడ్లు మొలక వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం వడ్లు క్వింటాలు రూ.2 వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధరకు అమ్మలేక, అలాగే ఉంచుకోలేక సతమతమవుతున్నారు. ఇక నాలుగు నెలల క్రితం సాగు చేసిన కంది పంటలో ఇటీవల కురిసిన వర్షాలకు పూత రాలిపోగా.. ప్రస్తుతం మరోసారి పూత వచ్చింది. తుపాను ప్రభావంతో వర్షం కురిస్తే పూత రాలిపోతే కంది పంట దెబ్బతిన్నట్లేనని రైతులు వాపోతున్నారు.

పనిభారం తగ్గించండి

- ప్రభుత్వ ఆస్పత్రి నర్సుల ఆవేదన



సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నతో మాట్లాడుతున్న నర్సులు

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో పనిభారంతో నర్సులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే అంశాన్ని బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న దృష్టికి బుధవారం పలువురు నర్సులు తీసుకెళ్లారు. 40 మంది స్టాఫ్ నర్సులకు గాను 29 మంది మాత్రమే ఉన్నామని, 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గతంలో రాత్రి డ్యూటీలు మూడు నెలలకోసారి ఉండేవని, ఇప్పుడు రెండు నెలలకోసారి డ్యూటీలు వేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పనిభారం అధికమైందన్నారు. ఈ క్రమంలో రోగులకు సేవలందించడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. దీనిపై సూపరింటెండెంట్ మాట్లాడుతూ... సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డేవిడ్ రాజ్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాలతో ఆట

నవంబర్ 6: తలుపుల మండలంలోని ఏపులపల్లి అటవీ ప్రాంతంలో కోడి పందెం నిర్వహిస్తున్న 20 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. 20 ద్విచక్ర వాహనాలు, 20 సెల్‌ఫోన్లు, 8 కోళ్లు, రూ.60,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నవంబర్ 8: నల్లచెరువు మండల పరిధిలోని నడింపల్లి వద్ద జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6,180 స్వాధీనం చేసుకున్నారు.

నవంబర్ 8: గుడిబండ మండలం ఆచారిపాళ్యం గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.52,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాక పసిగట్టిన మరో ఐదుగురు తప్పించుకున్నారు.

నవంబర్ 10: తాడిమర్రి మండలం తురకవారిపల్లి సమీపంలో నిర్వహించిన పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,620 నగదు స్వాధీనం చేసుకున్నారు.

... ఇవి మచ్చుకు కొన్నిమాత్రమే. జిల్లాలోని చాలా ప్రాంతాలు పేకాట, కోడిపందేలకు అడ్డాగా మారాయి. పోలీసులకు సమాచారం తెలిసి..ఎలాంటి ఒత్తిళ్లు లేకపోతేనే దాడులు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే వ్యవహారాలు సాగుతుండటంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.



నల్లచెరువు మండలం నడింపల్లి వద్ద జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



గుడిబండ మండలం ఆచారపాళ్యంలో పేకాటరాయుళ్లతో సీఐ రాజకుమార్

- జిల్లా వ్యాప్తంగా జోరుగా పేకాట
- సరిహద్దులో పుంజుకున్న కోడి పందేలు
- హిందూపురంలో ఆగని మట్కా
- కూటమి నేతల కనుసన్నల్లోనే అక్రమాలు
- కేసులు వద్దని పోలీసులపై ముఖ్యనేతల ఒత్తిళ్లు

సాక్షి, పుట్టపర్తి

అక్రమార్జనే ధ్యేయంగా కూటమి పార్టీల నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. కొన్ని ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని పేకాట, మట్కా, కోడిపందేలను నిర్వహిస్తున్నారు. పోలీసులు లాఠీ ఎత్తినా అధికారం చూపి భయపెడుతున్నారు. ముఖ్య నేతలు కూడా 'మా తమ్ముళ్లే' కేసులు నమోదు చేయొద్దంటూ ఆదేశాలిస్తున్నారు. దీంతో చాలా చోట్ల పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కానీ విధి నిర్వహణలో భాగంగా కొందరు పోలీసులు తమ పని తాము చేసుకుంటూ ఎక్కడికక్కడ అరెస్టు చేసి.. కేసులు నమోదు చేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. అలాంటి అధికారులపై కూటమి నేతలు భారీగా ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. అందుకే జిల్లాలో జూద కేంద్రాలపై దాడులు చేయాలంటే ఎస్పీ ఆదేశాలుండాలి.. లేదంటే డీఎస్పీ నేతృత్వం వహించాల్సిన పరిస్థితి వచ్చింది.

సరిహద్దును అడ్డాగా మార్చుకుని..

జిల్లాలోని 32 మండలాల్లో 16 మండలాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలో కొన్ని ప్రాంతాలను స్థావరాలుగా మార్చుకున్న కొందరు జూద కేంద్రాలు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. హిందూపురం, కదిరి, పెనుకొండ పట్టణాలోని కొన్ని భవనాల్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. హిందూపురం శివారులోని ఓ ఫంక్షన్ హాలులో రహస్య స్థావరాలు ఉన్నట్లు స్థానికులే చెబుతున్నారు. భవనాల చుట్టుపక్కల మట్కా చార్టులు బయటికి రావడమే సాక్ష్యంగా తెలుస్తోంది. ఇవన్నీ పోలీసులకు తెలిసినా ముఖ్యనేతల ఆదేశాలతో అటువైపు వెళ్లడం లేదని జనమే చెప్పుకుంటున్నారు.

'పుంజు'కున్న పందేలు

కూటమి నేతల అండదండలతో జూద కేంద్రాల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. పేకాట, మట్కా, కోడిపందేలు ఆడిస్తూ అందినంత దోచుకుంటున్నారు. జూదం మత్తులో పడి చాలా మంది ఆర్థికంగా చితికిపోయారు. ఉన్న డబ్బులు పోగొట్టుకుని.. పోయినవి రాబట్టుకునే క్రమంలో ఆస్తులు అమ్మకానికి పెట్టిన వారూ ఉన్నారు. పోయినవి వస్తే చాలని చెబుతూ.. నిత్యం జూదం ఆడుతున్న వారు కూడా ఉన్నారు. ఫలితంగా జీవితాలను ఫణంగా పెట్టి 'ఆట' ఆడుతున్నారు.

ఆట కట్టిస్తాం



మట్కా కేంద్రాలు, పేకాట స్థావరాలు, కోడిపందేలపై ప్రత్యేక దృష్టి సారించాం. రాజకీయ నేతలకు తలొగ్గే ప్రసక్తే లేదు. జూదం నేరం.. దొరికితే వదిలే ప్రసక్తే లేదు. జూదం ఉచ్చులో పడి జీవితాలు నాశనం చేసుకోకండి. ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపాం. రాత్రింబవళ్లు గాలింపు చర్యలు చేపట్టాం. – వి.రత్న, ఎస్పీ

పరిటాల ఇలాకాలో జోరుగా పేకాట

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరిలోని వివిధ గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి పంచాయతీల్లోని పలు గ్రామాలు జూదానికి అడ్డాగా మారాయని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని చాలా గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉండటంతో అటు కర్ణాటక నుంచి ఇటు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పేకాటరాయుళ్లు ఇక్కడకువస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా.. పేకాట కేంద్రాలను కూటమి నేతలే నడిపిస్తుండటంతో పోలీసులు ఏమీ చేయలేకపోతున్నారని తెలుస్తోంది. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం అడపాదడపా దాడులు చేసి పేకాటరాయుళ్లతో డబ్బులు దండుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే పేకాటను వ్యసనంగా మార్చుకున్న కొందరు స్థానికులు ఇంట్లోని బంగారు ఆభరణాలు కుదువపెట్టి పేకాడుతున్నట్లు కుటుంబీకులే వాపోతున్నారు.

'అపార్' వేగవంతం చేయండి



అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఆధార్ తరహాలో అపార్ ఐడీ జనరేషన్‌కు వివరాల నమోదును వేగవంతం చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో అపార్ విధివిధానాలపై కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థులకు సంబంధించి అపార్ జనరేషన్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ కారణాల వల్ల రిజిస్ట్రేషన్ కాని వాటిని కేటగిరీల వారిగా విభజించి పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 1,67,082 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 1,49,770 మంది అపార్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మిగిలినవి పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అర్డీఓ సువర్ణ, డీఈఓ క్రిష్టప్ప, డీఐఈఓ రఘునాథరెడ్డి, ఎంఈఓలు జయచంద్ర, ఆనంద్‌బాబు, సంపూర్ణ, డీపీఓ సమత, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయకపోతే చర్యలు..

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయకపోతే డీఈఈలు, ఏఈఈలపై చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీరాజ్, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. డీఈలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. పుట్టపర్తి, మడకశిర క్లస్టర్లలో పంచాయతీ రాజ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు లక్ష్యాలను వంద శాతం అధిగమించాలని ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే అధికారుల నుంచి సొమ్ము రికవరీ చేస్తామని హెచ్చరించారు. బ్లాక్ ప్లాంటేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్ పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ మురళీకృష్ణ, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, పలువురు డీఈఈలు పాల్గొన్నారు.

'పంట నష్టం' నివేదించండి

- వ్యవసాయ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు
- రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్లకు 'ఇన్‌పుట్'
- 46 మండలాల రైతులకు 'సబ్సిడీ' నిల్



ఎండిన వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: కరువు జాబితాలో ప్రకటించిన మండలాల్లో పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు బుధవారం ఉత్తర్వులు అందాయి. జిల్లాలో అనంతపురం, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు కరువు మండలాల జాబితాలో ఉండగా, శ్రీ సత్యసాయి జిల్లాలో తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను ప్రకటించారు. మిగిలిన 46 మండలాలు కరువు జాబితాలో ప్రకటించలేదు.

గరిష్టంగా రెండు హెక్టార్లకు..

కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిసాయం) ఇవ్వడానికి వీలుగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్ఎఫ్) నిబంధనల మేరకు పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. 33 శాతం అధికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి.. ప్రతి రైతుకూ గరిష్టంగా రెండు హెక్టార్లకు పరిగణలోకి తీసుకుని సమగ్ర వివరాలతో కూడిన 33 కాలమ్స్ ఫార్మాట్ సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, ఏవోలు, ఏడీఏలతో కూడిన గ్రామ, మండల, సబ్ డివిజనల్ బృందాలతో పంట నష్టం జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఈనెల 20 నుంచి 25 తేదీల మధ్య ఆర్‌ఎస్‌కేల్లో జాబితాను ప్రదర్శించాలని, పొరపాట్లు, తప్పిదాలు ఉంటే అభ్యంతరాలు స్వీకరించి అవసరమైతే సవరణ చేయాలని సూచించారు. తుది జాబితా ఈనెల 28న ప్రభుత్వానికి అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్కడా డబుల్ ఎంట్రీలు, పొరపాట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఉపశమనం ఇలా..

పంటనష్టం ఉపశమనం కింద (స్కేల్ ఆఫ్ రిలీఫ్) కింద వేరుశనగ, పత్తి, వరి, మిరప, కూరగాయలు, ఉల్లి, పూలు, బొప్పాయి, కళింగర, కర్బూజా పంటలకు హెక్టారుకు రూ.17 వేల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మొక్కజొన్న హెక్టారుకు రూ.12,500, కంది, మినుము, పెసలు, అలసంద లాంటి పప్పుదినుసు పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఆముదం పంటలు హెక్టారుకు రూ.8,500 ప్రకారం ఒక్కో రైతుకు గరిష్టంగా 2 హెక్టార్లకు పరిహారం అందేలా జాబితాలు సమగ్రంగా తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు జాబితాలను రూపొందించడంపై దృష్టి సారించారు.

మహిళలపై అఘాయిత్యం

- రావులచెరువులో 'తమ్ముళ్ల' దాష్టీకం
- మద్యం మత్తులో హోటల్ నిర్వాహకురాళ్లపై దాడి
- డీజిల్ పోసి నిప్పంటించేందుకు యత్నం

ధర్మవరం రూరల్: మహిళలపై దాడులు, అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. రావులచెరువు గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. పూటుగా మద్యం తాగి హోటల్ నిర్వాహకులైన ఫాతిమా, షర్మిల, నూర్ అనే మహిళలపై కట్టెలు, రాళ్లతో దాడి చేసి, డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశారు. గాయపడిన మహిళలు ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. బాధితులు తమపై జరిగిన దాష్టీకాన్ని బుధవారం మీడియాకు వెల్లడించారు. తాము గ్రామంలో చిన్నపాటి హోటల్-చిల్లర దుకాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బాబులాల్, అశోక్, పెద్దబాబు మంగళవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించారన్నారు. తాము తిరగబడి దండించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. అదే రోజు రాత్రి మద్యం మత్తులో వచ్చి హోటల్‌ను ధ్వంసం చేయడమే కాకుండా తమపై రాళ్లు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారన్నారు. అక్కడే క్యాన్‌లో ఉన్న డీజిల్‌ను తమపై పోశారన్నారు. నిప్పుపెట్టేందుకు ప్రయత్నిస్తుండగా బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నామన్నారు. తమపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మహిళలపై జరిగిన దాడి ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు నిప్పు పెట్టి ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. విషయం తెలిసిన వెంటనే ధర్మవరం రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

బాలలు... ప్రతిభావంతులు

సందర్భం : నేడు బాలల దినోత్సవం

పిల్లలే.. కానీ, తమకంటే వయసులో పెద్దవారి కంటే గొప్ప విజయాలు సాధించారు. బడికెళ్లే వయసులోనే వీళ్లు తమ ఆలోచనలకు పదును పెట్టారు. అనూహ్యామైన విజయాలను సొంతం చేసుకుంటున్నారు. అలాంటి చిన్నారుల్లో ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పే బాలల దినోత్సవం రానే వచ్చింది. ఏటా నవంబర్ 14న దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గురువారం చాచా నెహ్రూ జయంతిని చిన్నారుల సృజన నడుమ ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో చిరుప్రాయంలోనే అనూహ్యామైన విజయాలను సొంతం చేసుకున్న చిన్నారుల్లోని ప్రతిభపై 'సాక్షి' కథనం.
– అనంతపురం కల్చరల్

చదరంగంలో చిచ్చరపిడుగు



అనంతపురం నగరానికి చెందిన కీర్తి, కాశి రవీంద్ర దంపతుల కుమార్తె శమిక... ఏడేళ్ల ప్రాయంలోనే చెస్‌లో రాణిస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీల్లో మూడు దేశాలకు చెందిన 508 మంది క్రీడాకారులు క్లాసికల్ విభాగంలో, 528 మంది క్రీడాకారులు ర్యాపిడ్ విభాగంలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న శమిక... క్లాసికల్ విభాగంలో ఐదో స్థానం, ర్యాపిడ్ విభాగంలో 4వ స్థానం దక్కించుకుని ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌లో 1300 ర్యాంకును కైవసం చేసుకుంది. అలాగే బ్లిట్జ్ విభాగంలో రెండో స్థానం దక్కించుకుంది.

కేక పెట్టించే డ్యాన్స్



అనంతపురానికి చెందిన లక్ష్మీకాంత్, సులోచన దంపతుల కుమారుడు ద్వారకసాయి... స్థానిక ఓ కార్పొరేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల ప్రాయం నుంచే ఫోక్, వెస్ట్రన్ డ్యాన్సుల్లో రాణిస్తూ గుంటూరు, తిరుపతి, విజయవాడ, హైదరాబాదులో జరిగిన పోటీల్లో పాల్గొని బహుమతులందుకున్నాడు. 2023లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి నాట్య పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. 2024లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్సు స్పోర్ట్స్‌లో మరోసారి ప్రథమ స్థానంలో నిలిచాడు.

'గగన'మే హద్దుగా



అనంతపురం నగరానికి చెందిన భార్గవి, భరణీకార్తీక్ దంపతుల కుమార్తె గగన అన్విక... నాల్గో తరగతి చదువుతోంది. అనంతపురంలోని నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ వద్ద కూచిపూడి అభ్యసిస్తోంది. పట్టుమని పదేళ్ల వయసు కూడా దాటకనే జాతీయ స్థాయిలో 30 అవార్డులను సొంతం చేసుకుంది. నాగపూర్‌లో జరిగిన జాతీయ డ్యాన్సు ఒలింపిక్స్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న గగన... అనంతరం ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాదు తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకుంది.

స్కేటింగ్‌లో మెరుపు



అనంతపురం నగరానికి చెందిన హంజా హుస్సేన్ కేవలం ఏడేళ్ల ప్రాయంలోనే స్కేటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. ఇటీవల కాకినాడలో జరిగిన 36వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏకంగా రెండు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. రోలర్ స్కేటింగ్, రోడ్ రేస్ విభాగంలోనూ సత్తా చాటుతున్నాడు.

హామీలు నెరవేర్చు బాబు : రామకృష్ణ

బత్తలపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీఎం చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. నిడిమామిడి మఠం భూమిలో నిరుపేదలకు ఇంటి పట్టాలు దక్కే వరకూ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. బత్తలపల్లి సమీపంలోని నిడిమామిడి మఠం భూమిలో ఇల్లు లేని నిరుపేదలతో నాలుగు నెలల క్రితం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా గుడిసెలు వేయించిన విషయం తెలిసిందే. ఆక్రమిత స్థలంలో బుధవారం వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి మాల్యవంతం కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. జిల్లా మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇరువురి పేర్లలో సత్యం ఉందని, వీరి ద్వారానే పేదలకు న్యాయం చేకూరేలా పోరాటాలు సాగిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు మాట్లాడుతూ... భూ పోరాటంలో భాగంగా నాలుగు నెలల నుంచి నిరుపేదల నివేశన స్థలాల కోసం పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, మండల కార్యదర్శి వెంకటేష్, మండల వ్యకాసం కార్యదర్శి బత్తల నాగభూషణ, మండల అధ్యక్షుడు చిన్న పెద్దన్న, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షుడు సత్యప్ప, తదితరులు పాల్గొన్నారు.